యువతరం.. వ్యసన భరితం..

- బాధ్యతలు మరచి.. జల్సాలకు మరిగి
- అప్పులపాలు.. అనారోగ్యాల పాలు
- ధర్మవరంలో పెరిగిపోతున్న మత్తురాయుళ్లు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో కొంత మంది యువకులు పెడదోవ పడుతున్నారు. మద్యం, సిగరెట్లు, మట్కా ఇతర దురలవాట్లకు అలవాటుపడి జీవితాలను గుల్ల చేసుకుంటు న్నారు. గుడి, బడి, ఇల్లు, బహిరంగ ప్రదేశం అనే తేడా లేకుండా సిగరెట్లు తాగుతూ గుట్కాలు నములుతున్నారు. రాత్రి, పగలనే తేడా లేకుండా మద్యం దుకాణాలకు క్యూ కడుతున్నారు. ఈ వ్యసనాల వల్ల సమస్యలు వస్తాయని తెలిసినా అంతా మా ఇష్టం అంటూ పెద్దవారిని సైతం లెక్కచేయడంలేదు. మున్సిపాలిటీ పరిధిలో మత్తుకు బానిసైన యువత సంఖ్య 12వేల దాకా ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.

జల్సాల ఖర్చు ఎంతంటే..

సిగరెట్టు తాగితే రూ.10 కదా.. గుట్కా నమిలితే రూ.8 కదా, మట్కా ఆడితే రూ.50 కదా అని అనుకోవద్దు. ఒక్కో వ్యక్తి రోజుకు నాలుగు సిగరెట్లు, రెండు గుట్కాలు, మద్యం కోసం అటు ఇటుగా రూ.400కు పైగా ఖర్చు చేస్తున్నాడు. ఈ లెక్కన నెలకు రూ.12వేలు, ఏడాదికి రూ. 1.44లక్షలకుపైగా ఖర్చు అవుతోంది. ఇలా వారి స్థాయిని బట్టి ఖర్చు చేసేవారి లెక్కలు ఏడాదికి రూ.లక్షల్లో ఉంటోంది. ఇలాంటి లెక్కలు వేసుకుని జల్సాల కోసం వెచ్చి స్తున్న సొమ్ము తగ్గించుకుంటే కుటుంబం ఆర్థికంగా ఏ స్థాయిలో మెరుగుపడుతుందో ఆలోచించండి.



లోన్ యాప్‌లతో అప్పులపాలు..

ప్రస్తుతం యువత చేతిలో నిరంతరం ఉండే మొబైల్ ద్వారా వచ్చే లోన్ యాప్‌లలో అప్పులు చేసి మరీ జల్సాలకు అలవాటు పడుతున్నారు. సిగరెట్, మద్యం, గుట్కా ఇలా చెడు వ్యసనాలకు ఇళ్లల్లో డబ్బులు అడగలేక లోన్ యాప్‌ల ద్వారా అప్పులు చేసి మరీ విచ్చల విడిగా ఖర్చు చేస్తున్నారు. చివరికి లోన్ యాప్ లలో అప్పులు వెనక్కి చెల్లించలేక వారి ఒత్తిళ్లను భరించలేక కొంతమంది ఆత్మహత్యలు సైతం చేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయి. కొంత మంది తల్లిదండ్రులకు చెప్పి లోన్ యాప్‌లలో తీసుకున్న అప్పులను కట్టిస్తున్నారు.

వ్యసనాలతో జీవితం అంధకారమే



నీ స్నేహితుడు ఎలాంటివాడో తెలిస్తే నువ్వు ఎలాంటి వాడివో అర్థం చేసుకోవచ్చు. మంచివారి స్నేహం చేస్తే వారి బతుకు మంచిగానే ఉంటుంది. ఈమధ్య కాలంలో చెడు స్నేహమే యువతను పక్కదారి పట్టిస్తోంది. వ్యసనాలకు బానిసలై నేరాలు, దొం గతనాలకు పాల్పడుతున్నారు. మత్తుకు అలవాటుపడ్డ అనేక మంది కుటుంబాల పరిస్థితి దారుణంగా ఉంటోంది. సంపాదన లేకున్నా అంతంత మాత్రంగా ఉన్నా మత్తుకు రోజుకు రూ.వం దల్లో ఖర్చు చేస్తున్నారు. మత్తు వదిలితే ఆ కుటుంబం ఆర్థికంగా నిలబడుతుంది. చెడు వ్యసనాలకు బానిసలై జీవితాన్ని అంధకారం చేసుకోవద్దు. – **రెడ్డప్ప, సీఐ, టూటౌన్ పోలీస్‌స్టేషన్, ధర్మవరం**

యువత పెడదారి పడుతోంది



ధర్మవరం పట్టణంలో ఎక్కువగా యువతే పెడదారి పడుతోంది. సిగరెట్లు, మద్యం ఇలా చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. చాలామంది యువత అనారోగ్య సమస్యలతో మా వద్దకు వచ్చినప్పుడు కౌన్సెలింగ్ ఇచ్చాం. అయినా వారిలో మార్పు రాలేదు. తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చాలామంది సిగరెట్లు, గుట్కా, మద్యం ఇలా చెడు వ్యసనాలకు బానిసలవ్వడంతో వారికి నోటి క్యాన్సర్లు, ఊపిరితిత్తులు పాడవడం ఇలా తదితర రోగాలబారిన పడి చిన్న వయస్సులోనే మృత్యువుకు దగ్గర అవుతున్నారు.
– **డాక్టర్ టీఎం బషీర్, మత్తు వైద్య నిపుణులు, ధర్మవరం**

అనర్థాలపై అవగాహన కల్పించాలి



కళాశాలల్లో చదివేటప్పుడే విద్యార్థులకు చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థా లపై అవగాహన కల్పించాలి. నేడు సెల్‌ఫోన్లతో యువత చెడిపోతోంది. ఇం టికి ఆలస్యంగా వచ్చే పిల్లలను తల్లిదండ్రులు దండించకపోవడంతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారు. ముఖ్యంగా మొబైల్‌లో లోన్ యాప్‌ల ద్వారా అప్పులు చేసి మరీ చెడు వ్యసనాలకు బానిసలవుతున్న యువతలో మార్పు తీసుకువచ్చేందుకు కళాశాలల్లో ప్రత్యేక తరగతులు, అవగాహన సద స్సులు నిర్వహించాలి.
– **మంజుల నరేంద్ర, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ధర్మవరం**

రెవెన్యూ నిర్వాకంతో రుణం రెన్యూవల్‌కు ఆటంకం

- రైతు ఆవేదన

పుట్టపర్తి అర్బన్: రెవెన్యూ అధికారుల నిర్వాకం కారణంగా తన రుణం రెన్యూవల్‌కు ఆటంకంగా ఏర్పడిందని దిగువచెర్లోపల్లికి చెందిన రైతు యను ముల రంగనాథరెడ్డి మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. సర్వే నంబర్ 85–7లో తాతల నుం చి సంక్రమించిన 61 సెంట్ల భూమి తన పేరిట ఉం దన్నాడు. ఈ భూమిపై బ్రాహ్మణపల్లి ఎస్‌బీఐ బ్రాం చిలో వ్యవసాయం రుణం తీసుకున్నాని తెలిపాడు. అయితే 2023లో అప్పటి తహసీల్దార్ నవీన్‌కు మార్, వీఆర్వో జెన్న ఓబుళప్పలు తన ప్రమేయం లేకుండా జగన్నాథరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, శివారెడ్డి పేర్లపైకి భూమిని మార్పు చేసి ఆన్‌లైన్‌లో ఎక్కించా రన్నాడు. ఈ విషయం ఇటీవల రుణం రెన్యూవల్ కోసం బ్యాంకు వెళ్లినపుడు తనకు తెలిసిందని చెప్పాడు. వెంటనే వీఆర్వోకు ఫోన్ చేస్తే స్పందించ లేదన్నాడు. దీంతో నెల కిందట కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేసి.. తన గోడు వెల్లబోసుకున్నానని పేర్కొన్నాడు. అయినా ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో నేడు తహసీల్దార్ కల్యాణ్‌ను కలవగా.. అర్జీ అందిం దని.. త్వరలోనే ఇతరుల పేరు మీద నుంచి భూమిని తనపేరుపైకి మారుస్తామని చెప్పార న్నాడు.



వివరాలను వెల్లడిస్తున్న రైతు రంగనాథరెడ్డి

క్రికెట్ టోర్నీ విజేత ఎనుములపల్లి జట్టు

పుట్టపర్తి టౌన్: దివంగత జానకీరామయ్య జ్ఞాప కార్థం రామ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని సాయినగర్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెం ట్‌లో ఎనుములపల్లి జట్టు విజేతగా నిలిచింది. సోమవారం ఫైనల్‌లో పుట్టపర్తి జట్టుతో తలపడి గెలుపొందింది. విజేతలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ చేతుల మీదుగా కప్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగు తుందని పేర్కొన్నారు. నెల రోజుల పాటు స్నేహ పూర్వక వాతావరణంలో టోర్నమెంట్ నిర్వహిం చడం ఆనందంగా ఉందన్నారు. క్రీడలు మనిషి జీవితంలో ఒక భాగం కావాలని, క్రీడలు ఉల్లా సాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో సామకోటి ఆదినారాయణ, తొట్ల గంగాధర్, మురళి, షామీర్ బాషా పాల్గొన్నారు.



కప్ అందజేస్తున్న మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్

రాష్ట్ర కురుబ యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా జమదగ్ని గౌడ్

ప్రశాంతి నిలయం: రాష్ట్ర కురుబ యువజన సంఘం ఉపాధ్య క్షుడిగా బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామానికి చెం దిన కప్పల జమదగ్నిగౌడ్ ఎన్నికయ్యారు. సోమవారం మద నపల్లెలో జరిగిన కురుబ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం లో ఆయన్ను ఎన్నుకున్నారు. జమదగ్ని గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్షునిగా అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి లింగ మూర్తి, కోశాధికారి చిరుతల వితలగౌడ్, కురుబ యువత రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణంరెడ్డిపల్లి కాటమయ్యకు ధన్యవాదాలు తెలియజేశారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

వేతనాలు చెల్లించండి

ముదిగుబ్బ: గ్రామీణ నీటి సరఫరా శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న తమకు 9 నెలల వేతన బకాయిలను వెం టనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. 22 మంది పనిచేస్తున్నామని, నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం తో కుటుంబ పోషణ భారంగా మారింద న్నారు. అయినా తమ విధులను బాధ్య తతో నిర్వర్తిస్తూనే ఉన్నామన్నారు. తమ ఇబ్బందులను గమనించి వేతనాలు మంజూరు చేయాలని ఆ శాఖ సూపరిం టెండెంట్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వాలు జవాబుదారీగా పనిచేయాలి

కదిరి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని సీపీఐ జిల్లా కార్య దర్శి వేమయ్య యాదవ్ సూచించారు. సోమవారం సీపీఐ కదిరి పట్టణ రెండో మహాస భలు నిర్వహించారు. ఆర్‌ఎస్ రోడ్డులో సీపీఐ జెం డాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్జీఓ హోంలో జరిగిన మహాసభలో జిల్లా కార్యదర్శి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీ–నీవా ప్రాజె క్టుకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యతనిచ్చామని చెప్పు కుంటున్న ప్రభుత్వం.. పిల్లకాలువలు తవ్వకుండా లైనింగ్ పనులతో కుప్పానికి నీరు తీసుకెళ్లడం సరి కాదన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డ్రిప్ ఇరిగేషన్‌కు 100 శాతం సబ్సిడీ అందిం చాలని కోరారు. గ్రామీణ పేదలకు మూడు సెం ట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్ల చొప్పున నివే శన స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం 21 మందితో సీపీఐ కదిరి మండల నూతన శాఖ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేంద్ర చౌదరి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, వ్యవ సాయ కార్మిక సంఘం నాయకులు కదిరప్ప, పట్టణ కార్యదర్శి లియాకత్, నాయకులు రమణ, పవన్, మహేంద్ర, మధునాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

శుభ్రతతోనే వ్యాధులు దూరం

బత్తలపల్లి: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని బత్తల పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. 'డెంగీ జ్వరాల కలకలం' శీర్షికన ఆది వారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం వైద్య సిబ్బందితో కలిసి జ్వరంతో బాధపడుతున్న బాలుడు సాయి నివాసం ఉంటున్న కాలనీలో పర్యటించారు. ఇం టింటికి వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారి వివ రాలను సేకరించారు. పరిసరాలను పరిశీలిం చారు. అనంతరం కాలనీలోని ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేశారు. అందులో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజ మాన్యానికి సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో జ్వరాలతో బాధపడు తున్న వారు ఎవ్వరూ లేరన్నారు. సాయి అనే బాలుడు కూడా జ్వరం నుంచి కోలుకున్నట్లు తెలి పారు. డెంగీ వ్యాధి నిర్ధారణ కాలేదన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖర్, మలేరియా అసిస్టెంట్ మారుతి, ఏఎన్‌ఎంలు కవిత, ఆశా వర్కర్లు సాయిలీల, నారాయణమ్మ, పర్వీనా, ఆషియా తదితరులు పాల్గొన్నారు.



జ్వరపీడితుల వివరాలను సేకరిస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

చంటి బిడ్డలతో భిక్షాటన చేస్తే చర్యలు

కదిరి టౌన్: పట్టణంలో ఎక్కడైనా చంటిబిడ్డలను భిక్షాటనకు ఉపయోగిస్తే కఠిన చర్యల తప్పవని సీఐ వి.నారాయణరెడ్డి హెచ్చరించారు. సోమవారం మమత స్వచ్ఛంద సంస్థ, కదిరి పట్టణ పోలీసులు సంయుక్తంగా పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చంటి బిడ్డలను ఎత్తుకుని భిక్షాటన చేస్తున్న ఐదుగురు మహిళ లను, అత్తతో కలిసి ఆవు దూడను పట్టుకొని భిక్షా టన చేస్తున్న 11 ఏళ్ల బాలికను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వీరికి సీఐ నారాయణరెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలల హక్కులను కాపాడా ల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాలల హక్కులు హరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుం టామన్నారు. పిల్లలను తీసుకుని స్వగ్రామాలకు వెళ్లి సురక్షితంగా పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



తల్లులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

యువత పోరుకు తరలిన నాయకులు



పుట్టపర్తికి బయల్దేరిన నాయకులు

కదిరి టౌన్: ఉద్యోగాల కల్పన లేదా నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పుట్టపర్తిలో తలపెట్టిన 'యువత పోరు'కు కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి విద్యార్థి విభాగం నాయకులు సోమవారం తర లివెళ్లారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర కార్య దర్శి రాజేంద్రయాదవ్, యూత్ విభాగం టౌన్ కన్వీ నర్ బాబా, నియోజకవర్గ కన్వీనర్ రమేష్ యాదవ్, నాయకులు నిఖిల్ సాయి, నల్లచెరువు యూత్ నాయ కులు మన్సూర్, మొఘల్ ఇర్ఫాన్, షాహిద్ తదిత రులు పాల్గొన్నారు.

3న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో జూలై మూడో తేదీన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించను న్నారు. పుట్టపర్తిలోని ఎస్‌ఎంఎస్ స్కూల్ ఎదురుగా ఉన్న పాలియేటివ్ కేర్ సెంటర్‌లో ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు క్యాంపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 35 సంవత్సరాలు పైబడిన మహిళలు 08047103700కు కాల్ చేసి పేరు నమోదు చేసుకో వాలన్నారు. ఎస్‌ఎంఎస్ ద్వారా అపాయింట్మెంట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి నెలా మొదటి గురువారం స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. సత్యసాయి ఆశీస్సులతో పట్టణానికి 50 కిలోమీటర్ల పరిధిలో 750 మందికి క్యాన్సర్‌తో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపతున్నవారికి వారి ఇళ్లల్లో, కేంద్రంలో కూడా ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు.

డిపో మేనేజర్ బదిలీ

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ (ఏటీఎం)గా బెంగుళూరుకు బదిలీ అయ్యారు. ఆరేళ్ల పాటు ఇక్కడ ఎనలేని సేవలందించారని ఉద్యోగులు కొనియాడారు. జూలై నెలలో ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ కానున్నారు.

క్లుప్తంగా

సొంత మండలంలో బదిలీలకు అవకాశమివ్వండి



ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కదిరి అర్బన్: తమకు సొంత మండలంలో బది లీలకు అవకాశం కల్పించాలని పలువురు గ్రామ సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఎంపీడీఓ పోలప్ప పకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా పదోన్నతులు కల్పించలేదన్నారు.

జీఓ 5ను రద్దు చేయాలి

నల్లచెరువు: జీఓ 5ను రద్దు చేసి సొంత మం డలాల్లోనే విధులు నిర్వహించే వెసులుబాటు కల్పించాలని సచివాలయ ఉద్యోగులు డిమాం డ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రఘునాథగుప్తాకు వినతి పత్రం అందజేశారు.

26న వాహనాల వేలం

తనకల్లు: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 26న స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు సీఐ మారుతీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారం భమయ్యే వేలంపాటలో పాల్గొనేవారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

తనకల్లు: మండల నూతన తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బుక్కపట్నం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దా ర్‌గా విధులు నిర్వహిస్తున్న శోభా సువర్ణమ్మ రొళ్లకు బదిలీ అయ్యారు.

కార్మికుల బైక్ ర్యాలీ



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, ఇం జినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, కార్యదర్శి జయ ఆధ్వర్యంలో పట్ట ణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జీఓ 36 ప్రకారం కార్మికులకు వేతనాలు అమలు చేయా లని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇంజినీ రింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవె న్స్‌లు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమం లో సీఐటీయూ నాయకులు ఎల్.ఆదినారా యణ, హైదర్‌వలి, కార్మిక సంఘం నాయ కులు అనిల్, కాటమయ్య, యోగి, దస్తగిరి, నరసింహులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల విద్యాలయంలో సమస్యలపై ఆరా

కదిరి అర్బన్: అలీపూర్‌తండాలోని గిరిజన బాలి కల విద్యాలయం (కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్)లో సమస్యలపై సోమవారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాంప్రసాద్ నాయక్, మానవహక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్షులు గంగులయ్య ఆరా తీశారు. కళాశాలలో ఉన్న 160 మంది బాలికలకు తగినన్ని బాత్రూ మ్‌లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని, మహిళా టీచర్ల అవసరాన్ని గుర్తించారు. ఈ విష యాలన్నీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

ధర్మవరం అర్బన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఖతిజున్‌కుబ్రా ఆదేశించారు. ఆర్డీఓ సమావేశ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి నాలుగు అర్జీలు అందాయి. ఈ సందర్భంగా అధికారులతో నిర్వ హించిన సమీక్షలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశిత గడువు లోపు పరిష్కరించాలని కోరారు.

ఆర్డీటీని కాపాడుకుందాం



మాట్లాడుతున్న షానవాజ్

కదిరి టౌన్: పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ఆర్డీటీని కాపాడుకుందామని కదిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కేఎస్ షానవాజ్ పిలుపుని చ్చారు. సోమవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన ఆర్డీటీ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పేదలకు పక్కాగృహాలు, విద్య, వైద్యం, స్వయం ఉపాధి తదితర రంగాల్లో చేయూత అందిందన్నారు. అలాంటి ఆర్డీటీకి విదేశీ నిధులు రాకుండా కేంద్రం అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్య క్షుడు మేదర నాగభూషణ, పట్టణ అధ్యక్షుడు అల్లాబకాష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే పాటించాలి



వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

బత్తలపల్లి: సీజనల్ వ్యాధుల నివారణ కోసం డ్రైడేను విధిగా పాటించాలని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ సూచించారు. సోమవారం వైద్య సిబ్బందితో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. చిన్న దోమతో పెద్ద ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల న్నారు. ఇంటి పరిసరాల్లో వాడి పడేసిన టైర్లు, కొబ్బరి బోండాలు, కొబ్బరి తిప్పలు, విరిగిన ప్లాస్టిక్ సామాన్లు, పూల కుండీలు, కూలర్లలో నీరు, వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి అవుతా యన్నారు. ఈ దోమల ద్వారా డెంగీ, మలేరియా, చికున్‌గన్యా జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని కోరారు. ఇంట్లో ఉన్న నీరంతా పారబోసి పాత్రలను ఆరబెట్టిన తర్వాత మళ్లీ నీరు నింపు కోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖర్, మలేరియా అసిస్టెంట్ మారుతి, ఏఎన్‌ఎం కవిత, ఆశా వర్కర్లు సాయిలీల, నారాయణమ్మ, పర్వీనా, ఆషియా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత బాధ్యత కార్యదర్శులదే

బత్తలపల్లి: గ్రామాల స్వచ్ఛత బాధ్యత కార్యదర్శుల దేనని ఎంపీడీఓ నరసింహానాయుడు పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన ఈఓఆర్డీ క్రిష్టప్ప, పరిపాలన అధికారి శ్రీనివాసు లుతో కలిసి స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంపై పం చాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి, ఏపీఓ ఆదెప్ప, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెం ట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి



శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ కోరారు. పుట్టపర్తిలోని బీజేపీ కార్యాలయం లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లా డుతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ దేశంలో ఒకే చట్టం ఒకే ప్రజ, ఏక్ భారత్ అనే నినాదంతో అందరినీ ఒకతాటిపైకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. కార్య క్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి కత్తి రాజారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొండమరాజు, నాయకులు బాలగంగాధర్, కళ్యాణ్‌కుమార్, రామాంజనే యులు, శివశంకర్‌రెడ్డి, నాగార్జునశెట్టి, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముఖర్జీ సేవలు ఎనలేనివి

కదిరి టౌన్: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు ఎనలేనివని బీజేపీ నాయకులు పేర్కొ న్నారు. సోమవారం కదిరిలోని బీజేపీ కార్యాలయం లో శ్యామ్‌ప్రసాద్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమం లో బీజేపీ పట్టణ అధ్యక్షులు పీట్ల రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగాధర్, కేశవరెడ్డి, రామకృష్ణ, వేణుగోపాల్‌రెడ్డి, ఇంతియాజ్, అశోక్‌కుమార్ తదిత రులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం రాత్రి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం ప్రారంభోత్సవం జరిగి 41 రోజులు పూర్త యిన సందర్భంగా మండల పూజ, మహా పడిపూ జను వేద పండితులు, గురుస్వామి పీజే విజయ్‌కు మార్ ఆధ్వర్యంలో చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.